ప్రజాశక్తి
మంగళవారం 4 మార్చి 2025 | 5 | శ్రీ సత్యసాయి

అదానీ పరిశ్రమ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

స్టాంప్ పేపర్ల కృత్రిమ కొరత..!

◆ అందుబాటులో లేని ఈ,ఎన్‌జె స్టాంపులు
◆ స్టాంపు వెండర్ల మాయాజాలం
◆ మూడు రెట్ల అధిక ధరకు బ్లాక్‌లో విక్రయాలు

ఆర్థిక లావాదేవీలకు అవసరమయ్యే నాన్ జ్యుడీషియల్(ఎన్‌జే), ఈ స్టాంప్ పేపర్లు దొరకడం గగనమైంది. స్టాంపు వెండర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బాండు పేపర్లు దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాల ద్వారా ఎన్‌జె స్టాంపులను విక్రయదారులకు పంపిణీ చేసే విధానాన్ని గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఓ ఏజెన్సీ ద్వారా ఎన్‌జె స్టాంపుల స్థానంలో ఈ స్టాంప్ పేపర్లను తీసుకువచ్చింది. స్టాంపు వెండర్ల ద్వారా ప్రజలకు అందుబాటులో వీటిని ఉంచాల్సి ఉండగా వీటికి కృత్రిమ కొరత సృష్టించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. రూ.10 స్టాంపును రూ.100, రూ.50 స్టాంపు పేపర్‌ను రూ.150, రూ.100 స్టాంపును రూ.200కు విక్రయిస్తూ స్టాంపు వెండర్లు మాయాజాలం చేస్తున్నారు. ఫలితంగా ప్రజల జేబులు గుల్లవుతున్నాయి.

ప్రజాశక్తి-పెనుకొండ

నాన్‌జుడీషియల్, ఈ స్టాంపుల కొరత వల్ల భూములు, ఆస్తుల క్రయ విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడు నెలలుగా పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. పెనుకొండలో 10 మందిపైగా స్టాంపు వెండర్లుఉన్నారు. వీరిలో కేవలం 6 మంది మాత్రమే స్టాంపుల విక్రయం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ స్టాంపు విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను పక్కన పెట్టేశారు. ప్రస్తుతం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. బయట మాత్రం మూడు రెట్లు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలిసినా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.



ఎన్‌జె, ఈ స్టాంప్ పేపర్లు

స్టాంపు వెండర్ల ఇష్టారాజ్యం...

వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ స్టాంపుల మీదే ఆధారపడాల్సి వచ్చేది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉండేవి కావు. అప్పట్లో స్టాంపు వెండర్ల హవా కొనసాగింది. వారు చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరించి స్టాంపు పేపర్లు అధిక ధరలకు అమ్మకం చేసి సొమ్ము చేసుకున్నారు. ఈ స్టాంపు విధానం వచ్చినప్పటికీ స్టాంపు వెండర్ల దోపిడీ అగలేదు. ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉన్నప్పటికీ కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం సబ్ రిజిస్ట్రార్‌కు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

అందుబాటులో నాన్‌జ్యుడీషియల్ స్టాంపు

కూటమి ప్రభుత్వం నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను పాత విధానం ద్వారా వెండర్లకు అందిస్తోంది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు రూ.10, రూ.20, రూ.50, రూ.100 ముఖ విలువ కలిగిన నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు పంపిణీ చేశారు. స్టాంపు వెండర్ల మాత్రం సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి తక్కువగా స్టాంపులు కొనుగోలు చేసి కొరత సృష్టించి అధిక ధరకు అమ్మకాలు చేస్తున్నారు.

నీరుగార్చిన గత ప్రభుత్వం..

ఆస్తి అమ్మకాలు, అగ్రిమెంట్లు, తనఖా, ఆఫిడవిట్లు, డిక్లరేషన్లు తదితర అవసరాలకు నాన్‌జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు అవసరం. వీటిని రిజిస్ట్రేషన్‌ల శాఖ నాసిక్ నుంచి ఆర్డరుపై తెప్పించి తొలుత జిల్లాలకు, ఆతర్వాత జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు పంపిణీ చేసేది. అక్కడి నుంచి స్టాంపు వెండర్లకు పంపిణీ చేసేవారు. రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని నీరుగారుస్తూ ఏజెన్సీలను రంగంలో దింపింది. ఈ ఏజెన్సీల ద్వారా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈ స్టాంపు పేపర్లను అమ్మడం ప్రారంభించింది. ఈపద్ధతిలో స్టాంపు వెండర్లు సబ్ రిజిస్టర్ కార్యాలయాల ద్వారా నాన్‌జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు తెచ్చి అమ్మకుండా, ఆన్‌లైన్ ద్వారా ఈ స్టాంపు పేపర్లను అమ్మడం ప్రారంభించారు. కొన్నాల్లు సవ్యంగా సాగినా రూ.10, రూ.20 ఈస్టాంపుల వల్ల లాభం తక్కువ అంటూ ఖాళీ స్టాంపులను జారీ చేయడం ఆపేశారు. ఈ కారణంగా నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు లేక ఈ స్టాంపు దొరక్క ఆర్థిక లావాదేవీలకు అఫిడవిట్లకు విఘాతం ఏర్పడింది. రిజిస్ట్రేన్లు కోసం ఒక స్టాంపు కాగితాన్ని వాడి, మిగిలినవి తెల్ల పేపర్లను వినియోగిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా రూ.5, రూ.10, రూ.20 స్పెషల్ అడిసివ్ స్టాంపు పేపర్ల కోసం రిజిస్టర్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. రూ.100 ఈ స్టాంపునకు అదనంగా రూ.200 వసూలు చేసి రూ.300కు అమ్ముతున్నారు.

స్టాంపు వెండర్లపై చర్యలు తీసుకోవాలి..

స్టాంపు వెండర్ల ఇష్టారాజ్యంగా అధికధరలకు స్టాంపులు విక్రయిస్తున్నారు. పట్టణంలో రూ.100 ఈ స్టాంపు కొనుగోలు చేయగా స్టాంపు వెండర్ రూ.200 తీసుకున్నారు. స్టాంపులు కొనాలంటే అదనపు ధరతో భయపడాల్సి వస్తోంది. వాపోయారు. అధికారులు స్టాంపుల అధిక ధరలకు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి.

ఉదయభాను, పెనుకొండ.

ప్రభుత్వం తక్కువగా పంపిణీ చేయాలంది..

నాన్‌జ్యుడీషయల్ స్టాంపులు వెండర్లకు తక్కువగా పంపిణీ చేయాలని ప్రభుత్వం పేర్కొంది. వెండర్లకు తక్కువగా పంపిణీ చేయడం వల్లనే స్టాంపు అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నారు. స్టాంపుల కొరత లేదు. అధిక ధరలకు విక్రయాలపై విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

సురేష్ ఆచారి, ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్.

వ్యవసాయ పొలాలపై అదానీ కాటు..!

కర్మాగార నిర్మాణ పనులతో అడుగంటుతున్న భూగర్భజలాలు
ఎండుతున్న పంటలు - ఆత్మహత్యలే శరణ్యం అంటున్న రైతులు

ప్రజాశక్తి తాడిమర్రి

మండల పరిధిలోని దాడి తోట పెదకోట్ల రెవెన్యూ పరిధిలో అదానీ హైడల్ విద్యుత్ కర్మగారం నిర్మాణం పనులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పనులతో తమ వ్యవసాయ పొలాలు బీళ్లుగా మారుతున్నాయంటూ చిల్లకొండాయపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు. కర్మాగార నిర్మాణ పనులను సోమవారం అడ్డుకున్నారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన రైతులు చెడిపోతుల శివయ్య, జోల్లి రెడ్డి, నాగార్జున, బనగానపల్లి రాజకీయప్ప తదితరులు మాట్లాడుతూ కర్మాగార నిర్మాణ పనుల్లో భాగంగా పెద్దఎత్తున డ్రిల్లింగ్ వేయడంతో భూమిలో ప్రకంపనలు పెరిగి తమ బోరు బావుల్లో నీరు అడుగంటి పోయాయని వాపోయారు. దీంతో తాము సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఈ నేపథ్యంలో తమకు ఆత్మహత్యే శరణ్యమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎంత కరువు వచ్చినప్పటికీ ఇలా తమ బోరు బావుల్లో ఒక్కసారిగా నీరు అడుగంటి పోలేదని అన్నారు. గ్రామంలో దాదాపు 120 మంది రైతులు 20వేల చిని చెట్లు సాగు చేస్తున్నారన్నారు. అందులో అంతర్ పంటగా కనకంబరాలు, టమోటా, మిరప లాంటి పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం చేపడుతున్న అదాని విద్యుత్ కర్మాగారం వల్ల ఒక్కసారిగా బోరు బావులు నీరు అడుగంటి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన చిలకొండయ్యపల్లి రైతులకు ఆత్మహత్యే శరణ్యమైందన్నారు. దీనికి తగిన పరిష్కారం ప్రభుత్వం సమీపానగల చిత్రావతి రిజర్వాయర్ నుండి ఎత్తిపోతల పథకం ద్వారా మూడు నెలల పాటు సాగునీరు అందించాలని చిల్ల కొండయ్య పల్లి రైతులు గతంలో కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఫిబ్రవరి 10న ఆందోళనకు దిగితే మార్చి ఒకటవ తేదీ లోపు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు ఎవరు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో దాడి తోట గ్రామ రైతులు మరొకసారి ట్రాక్టర్ వాహనాలు అడ్డుపెట్టి పనులను ఆడ్డగించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కృష్ణవేణి, ఇతర శాఖల అధికారులు ఆందోళన చేస్తున్న స్థలానికి చేరుకున్నారు. రైతులకు న్యాయం చేకూరేలా అదానీ యాజమాన్యం వారితో మాట్లాడతామని హార్టికల్చర్ వారి నివేదికను అనుసంధానం చేసుకొని నష్టపోయిన రైతులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దాడి తోట గ్రామ రైతులు ఆందోళన విరమించారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 214 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లాలో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. జనరల్ విద్యార్థులలో 9,256 మంది విద్యార్థులకు గాను 9,080 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 176 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1141 మంది విద్యార్థులకు గాను 1103 పంది విద్యార్థులు హాజరు అయ్యారు. 38 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. అన్ని పరీక్షల సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయంలో ఆయా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రింటింగ్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేంద్రాలను అధికారులు మూయించారు. ఈ పరీక్షలను జిల్లా పరీక్షల స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవ ప్రసాద్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు సురేష్ బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర ప్రసాద్ పర్యవేక్షించారు.

వేగవంతంగా పి-4 సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ చేతన్

జిల్లా వ్యాప్తంగా పి-4 సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని 246 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ సంబంధిత అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి త్వరగతిన పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి అర్థవంతమైన సమాధానం ఇవ్వాలన్నారు. అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతి వారం సమీక్షిస్తామన్నారు. జిల్లాలోని ప్రత్యేక అధికారులు పి-4 సర్వేను పర్యవేక్షించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా సర్వే లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ శాఖ జిఎం నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ పద్మావతి, ఏపీఎంఐపి పీడీ సుదర్శన్, ల్యాండ్స్ సర్వే ఏడీ విజయశాంతి బాయి, ఎల్‌డిఎం రమణ కుమార్, ఉద్యానవన శాఖ చంద్రశేఖర్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, డిఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి అత్యున్నత సేవలు

ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు

ప్రజాశక్తి-మడకశిర

దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభ తొలి దళిత స్పీకర్ జిఎంసి బాలయోగి అని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు కొనియాడారు. పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన కోనసీమ ముద్దుబిడ్డ, టిడిపి నేత జిఎంసి.బాలయోగి అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి బాలయోగి అన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి అత్యున్నతమైన లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగిన బాలయోగి జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. రాష్ట్రానికి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ బాలయోగి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం పునరంకితమవుదాం అని పిలుపునచ్చారు.

మారని వ్యవసాయ మార్కెట్‌యార్డు అధికారుల తీరు..!

◆ ఉదయం 11 గంటలు అయినా కార్యాలయానికి హాజరుకాని వైనం ◆ సూపర్‌వైజర్లకు మార్కెట్ సెక్రటరీ వత్తాసు

ప్రజాశక్తి-హిందూపురం

అధికారులు ఎవరూ లేక పోవడంతో ఖాళీగా మార్కెట్ కార్యాలయం

హాజరు పుస్తకంలో నెల ప్రారంభం కనిపించని సిబ్బంది పేర్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ హిందూపురం. హిందూపురం వ్యవసాయ మార్కెట్ కు వచ్చిన చింతపండు ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ విదేశాలకు సైతం ఎగుమతి అవుతుంది. మార్కెట్‌లో సోమవారం, గురువారం రెండు రోజులపాటు చింతపండు లావాదేవీలు జరుగుతాయి. చింతపండు లావాదేవీలు జరిగే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన చింత పండును హిందూపురం వ్యవసాయ మార్కెట్ కు తీసుకొస్తారు. గతవారం 1600 క్వింటాళ్ల చింతపండు మార్కెట్‌కు వచ్చింది. సోమవారం జరిగిన సంతకు 1390.80 క్వింటాళ్ల చింతపండు మార్కెట్‌కు వచ్చినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. సంత రోజు మార్కెట్ సూపర్‌వైజర్లతో పాటు కార్యదర్శి అందుబాటులో ఉండి ప్రతి లాటును పరిశీలించాల్సిన బాధ్యత వారిపై ఉంది. సోమవారం మార్కెట్ లో చింతపండు సంత ఉన్నప్పటికీ అధికారులు ఉదయం 11:00 గంటలు అవుతున్నప్పటికీ మార్కెట్ కార్యాలయానికి రాలేదు. దీంతో కార్యాలయం అంతా ఖాళీగా దర్శనమిస్తూ కన్పించింది. రైతులు తీసుకొచ్చిన చింతపండును గ్రేడింగ్ చేసి, రైతులకు మంచి ధర వచ్చే విధంగా చూడాల్సిన మార్కెట్ అధికారులు ఇవేమీ మాకు తెలియదు అన్నట్టు వ్యవహరించడంపై రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. యార్డులో సిబ్బంది హాజరు రిజిస్టర్‌లో మార్చి నెలకు సంబంధించి పేర్లు సైతం ఇంత వరకు రాయలేదంటే ఇక్కడి అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మార్కెట్ యార్డు కార్యదర్శి, సూపర్‌వైజర్లపై కలెక్టర్ శాఖ పరమైన చర్యలు తీసుకుని, రైతులకు మరింత న్యాయం జరిగే విధంగా చూడాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

వారు ఎప్పుడైనా రావొచ్చు : చంద్రమౌళి మార్కెట్ కార్యదర్శి

మార్కెట్ యార్డు కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులు సమయపాలన పాటించకుండా రావడం పై ప్రజాశక్తి మార్కెట్ యార్డ్ కార్యదర్శి చంద్రమౌళిని వివరణ కోరగా ఎగ్జిక్యూటివ్ సిబ్బంది ఎప్పుడైనా విధులకు రావొచ్చు, ఎప్పుడైనా పోవచ్చు అని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి సమయపాలన అంటూ ఏమీ లేదన్నారు. చెక్ పోస్టులు, ఇతర ప్రాంతాలు వారు పరిశీలనకు వెళతారని వివరించారు.

సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

డివిజన్ పరిధిలోని ప్రజలందరికీ సకాలంలో నిత్యావసర సరుకులను తప్పనిసరిగా పంపిణీ చేయాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆర్డీవో కార్యాలయంలో అర్బన్, రూరల్ కు సంబంధించిన ఎండియు ఆపరేటర్లు, ఎఫ్.పి షాప్ డీలర్ తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజలు అభిప్రాయాలు తెలియజేస్తారని, ఇందులో ముఖ్యంగా రేషన్ యొక్క నాణ్యత, సమయపాలన ,ఎండియు వెహికల్ ద్వారా పంపిణీ, ఇంటి వద్దనే రేషన్ విక్రయ వసూలు, తదితర అంశాలు ఉంటాయని తెలిపారు. డీలర్లు అందరూ గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నటరాజ్, సిఎస్‌డిటి సురేంద్ర, రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక అంగన్వాడీ కేంద్రం-1లో సోమవారం బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అంగన్వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల హాజరై మాట్లాడారు. బాల్య వివాహం చేయడం ద్వారా బాలికలు అనారోగ్యానికి గురవడం, అనారోగ్యం కలిగిన పిల్లలు జన్మనివ్వడం జరుగుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాలు చేయకూడదని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, మాధవి, ఆయాలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుక్కపట్నంలో బాల్య వివాహల నిర్మూలనపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌసల్య బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, అంగన్వాడి మండల అధ్యక్షులు నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్లు

ఢిల్లీ రైతుల ఉద్యమస్ఫూర్తితో పోరాడుదాం

రైతు సదస్సులో ఎపి రైతు సంఘాల కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-హిందూపురం

ఉత్తరాంధ్ర రైతులు తమ డిమాండ్లను పరిష్కరించుకోవడానికి దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున రైతులు చేపట్టిన ఉద్యమ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న రైతులు తమ డిమాండ్ల సాధన కోసం అలుపెరగని పోరాటం చేయాల్సిన అవసరం ఆసన్నమైనదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. అఖిల భారత రైతు, వ్యవసాయ కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని కంచి కామాక్షి కళ్యాణ మండపంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వడ్డే శోభనాద్రీశ్వర రావుతో పాటు, ఈఐ కెకెఎంఎస్ రైతు సంఘం కార్యదర్శి శంకర్ ఘోష్, చైతన్య గంగిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. హంద్రీనీవా ప్రాజెక్టు లైనింగ్ పనులు చేయడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. హంద్రీనీవాను సమగ్రంగా పూర్తి చేస్తే, సుమారు 40 టిఎంసిల నీరందే అవకాశాలున్నాయి. ఈ నీటిని అన్ని చెరువులకు అందిస్తే సుమారు 6 లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని తెలిసినా పూర్తి చేయకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అనంతరం రైతు సంఘం నాయకులు, రైతులు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండలంలోని జడ్పీ హైస్కూళ్లలో చదివే 410 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం హెల్పింగ్ హాండ్స్ తలబా ఆధ్వర్యంలో అట్టలు, పెన్నులు, ఇతర విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నట్లు హెల్పింగ్ హాండ్స్ తలబా సభ్యుడు ఆరీఫ్ తెలిపారు. తంగేడుకుంట, గౌనిపల్లి పాఠశాలల్లో 102 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. హెల్పింగ్ హాండ్స్ తలబా సభ్యులు రూ. 30 వేల విలువ చేసే సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ తలబా సభ్యులు ఫయాజ్, ముస్తాఖ్, వసీం, ఇద్రీస్, ఇస్మాయిల్,ఇమ్రాన్, సయ్యద్, ఇమామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఓబుళదేవరచెరువు : మండలంలోని నల్లగుట్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ నిర్మాణానికి సాతర్ల రమణమ్మ సోమవారం రూ. లక్ష విరాళం అందించారు. దాతను శివారెడ్డి, చెన్నారెడ్డి సన్మానించారు.

సిఎం తన వ్యాఖ్యలను వెనక్కుతీసుకోవాలి

వైసిసి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూర్తి

ప్రజాశక్తి-మడకశిర

సిఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వైసిసి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్ర ప్రజానీకం మొత్తానికి ముఖ్యమంత్రా లేక టిడిపికి చెందిన వారికి మాత్రమే ముఖ్యమంత్రా అని సూటిగా అడుగుతున్నామన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడిన సిఎం చంద్రబాబు వైసిపి వారికి ఏ పనులు చేయకూడదని, వారికి పనులు చేస్తే పాముకు పాలు పోసినట్లు అవుతుందని బహిరంగంగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. వైసిపి వారు కూడా ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని సిఎం గుర్తుపెట్టుకోవాలన్నారు. పక్షపాతం కానీ, రాగద్వేషాలు కానీ లేకుండా ప్రజలకు సేవ చేస్తానని ప్రమాణ స్వీకారం చేసి మీరు ఇలా మాట్లాడ డం శోచనీయ మన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

డ్రెయినేజీల్లో చెత్త తొలగించాలని వినతి

ప్రజాశక్తి -ధర్మవరం టౌన్

పట్టణంలోని సుందరయ్య నగర్ 29వార్డు లో మున్సిపల్ కాలువలు పూడుకుపోయి మురుగు నీరు ఇళ్లలోకి చేరుతోందని అధికారులు వెంటనే స్పందించి మురుగుకాలువలు శుభ్రం చేయించాలని టిడిపి వార్డు ఇన్‌ఛార్జి ముద్దుకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన తన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు సోమవారం అందజేశారు. స్పందించిన కమిషనర్ రెండు మూడు రోజులలో కాలువల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పరిగి : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ కృషి చేద్దామని ఎస్ఐ రంగడుయాదవ్ అన్నారు. సైబర్ సెక్యూరిటీ అవగాహన, డిజిటల్ ప్రపంచాన్ని రక్షించడంపై సోమవారం మండలంలోని కొడిగెనహళ్లి పాఠశాలలో భగత్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ సైబర్ సెక్యూరిటీపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ తారకనాథ్, సైబర్ క్రైమ్ టీం మెంబర్లు వేణుగోపాల్, శ్రీధర్, ఉపాధ్యాయులు రామలింగయ్య, లక్ష్మీనారాయణ, అరుణ్, శంకర్, బాబావాలి, భగత్ సింగ్ సేవాసమితి సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయం గోడపత్రిక విడుదల

పెనుకొండ : నాటుసారా, గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆనంద్‌కుమార్ ఎక్సైజ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పట్టణం లోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నవోదయం 2.0పై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. నాటుసారా నిర్మూలనపై పలు సలహాలు ఇచ్చారు. నవోదయం 2.0 గోడపత్రికను విడుదల చేశారు. సమావేశంలో ఎక్సైజ్ సిఐలు సృజన్‌బాబు, ప్రసాద్‌రావు, ఎస్ఐలు రాజశేఖర్, శంకర్, రాముడు, తహశీల్దార్లు శ్రీధర్, ఉదయశంకర్‌రాజు, ఎంపిడిఓ నరేష్‌కృష్ణ, రెవెన్యూ అధికారులు, ఎంపిడిఓలు, ఎక్సైజ్, పోలీసు సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నవోదయం 2.0 గోడపత్రికను విడుదల చేస్తున్న ఆర్డీవో, అధికారులు

మురుగు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణంలో ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మురుగు తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారిలో మురుగునీరు అనే శీర్షికన ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పారిశుధ్య కార్మికులతో మరమ్మతుపనులు చేయించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

దేవాలయ నిర్మాణానికి హిందూపురం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రావెళ్ళ లక్ష్మి, హిందూపురం పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు గ్రీన్ పార్క్ నాగరాజు తమ వంతుగా విరాళం అందజేశారు. లేపాక్షి మండలం కంచి సముద్రంలో రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దంపతులు తమ వంతుగా రూ.5 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో వేసవి ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని తారకరామ నగర్ లో తీవ్ర తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. మండల కేంద్రంలో రెండు బోరు బావులలో తాగునీరు పుష్కలంగా ఉన్నా కూడా వదలడానికి వాటర్ మెన్ సరిగా స్పందించడం లేదని వారు విమర్శిస్తున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యాలయ సిబ్బందికి విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తమ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్నాపై డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగంకు సిఐటియు జిల్లా కమిటీ ,ఆశ వర్కర్ల సంఘం నాయకులు సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇఎస్ వెంకటేష్, సాంబయ్య, ఆఫీస్ సిబ్బంది వెంకటేష్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సౌభాగ్య, నాయకులు పాల్గన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరశీలించి సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవో సువర్ణ తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆమె రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు తగిన పరిష్కారం చూపాలని తెలిపారు. మండల పరిధిలో ఎక్కువగా దారి సమస్యలు, ఇంటి స్థలాల సమస్యలు ఉన్నాయని వీఆర్వోల పనితీరు సరిగా లేదని పనితీరు మెరుగుపరచుకోవాలని లేకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిటి నరసింహులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, HINDUPURAMU
Succession Original Petition No. 7/2024
Between:
Noorjahan and 2 others ...Petitioner
AND
Nil ...Respondent
పై దావాలో వాదులు హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు Succession original petition వేసినారు. ఈ కేసు 07/03/2025వ తేదిన వాయిదా హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఉన్నది. పై దావాలో ఏమైన అభ్యంతరాలు ఎవరికైనా వున్నచో పైన తెలిపిన తేదిన హాజరై అభ్యంతరాలు తెలుపవలెను.
కె.త్రిలోక్, B.A., L.L.B.,
న్యాయవాది, మడకశిర.
సెల్:9440201167, 6281631011.

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE: DHARMAVARAM
O.S. No:725/2022
Between:
S.Mallikarjuna ...Plaintiff
And
N.Aslam ...Defendant
Notice to The Defendant
To,
N.Aslam S/o Late Nademmasid Anwar Sab, Business, R/at D.No:22/70, Sai Nagar, Dharmavaramu, Sri Sathya Sai Dist
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 13-03-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.L.N.Murthy, Advocate,
Dharmavaram. Cell: 9000862009.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL BEFORE THE HON'BLE DISTRICT JUDGE, ANANTAPURAMU
M.V.O.P. NO.205/2024
Between:
Vadde Peddanna ...Petitioner
AND
Nallappagari Nagabushana & another ...Respondents.
Notice To R1:
1. Nallapagari Nagabhushana, S/o N.Thippanna, Driver, D.No. 4-39, SC Colony, Maddalacheruvu (V), Kanaganapalli (M), Sri Satya Sai Dist.
Sir,
Please take notice, where as the above petitioner filed the above case against you and another claiming compensation for the injuries sustained by him in motor accident, you are hereby required to appear and answer the same by pleader or by person before this Hon'ble court on 19-3-2025 at 10:30 AM, failing which the said matter will be heard and determined by ex parte by the court.
// By Court Order //
Sri.N.Jayaram,
Advocate for the Petitioner

రైతు సమస్యలు పరిష్కరించాలి

మడకశిరలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెనుకొండలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -మడకశిర

రైతుల సమస్యలపై సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర, హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి చెరువులకు సాగునీరు, సెజ్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు, భూనిర్వాసిత రైతుల కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలు, లేనిచో సెజ్ భూములను రైతులకు వెనక్కి ఇవ్వాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, పగలు 9 గంటల నిరంతర విద్యుత్, స్మార్ట్ మీటర్ల తొలగింపు, పట్టు రైతులకు ఇన్సెంటివ్, జింకల సమస్య ఉన్న ప్రాంతాల్లో పొలాలకు కంచె ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ, పాడి రైతులకు లీటర్ పాలపై రూ. 10 ఇన్సెంటివ్, పంటలు, పశువులకు ఉచిత ఇన్సూరెన్స్, ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ. 600, రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎదుట కొడిగేపల్లి, కేతేపల్లి గ్రామాల రైతులు బైఠాయించి సాగు పట్టాలు ఇవ్వాలని విన్నవించారు. స్పందించిన తహశీల్దార్ మూడు రోజుల్లో పంట సాగుచేసిన రైతులకు సాగు పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సోము కుమార్, ఉపాధ్యక్షుడు అక్కంపల్లి రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంజునాథ్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, రైతు సంఘం నాయకులు సిఆర్.రెడ్డి, పాల రైతు సంఘం అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, రైతులు హనుమంతరాయప్ప, వేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. హరి మాట్లాడుతూ జిల్లాలో కరువు కాటకాలు, వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇకనైనా పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యాలు, సాగునీరు, సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, విద్యుత్, పాసు పుస్తకాలు, భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతుల ఆత్మహత్యలు, కూలీల వలసలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు లక్ష్మినరసప్ప, నగేష్, సిఐటియు కార్యదర్శి బాబావలి, రాజురావు, తిప్పన్న, నరసింహ, వలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకటరాముడు, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఏపీ రైతు సంఘం ధర్మవరం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైతుల సమస్యలపై ధర్మవరం తహశీల్దార్ నటరాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు ఆలకుంట మారుతీ, ఎస్ ఎచ్ బాషా, గుంపు హరి మాట్లాడుతూ అన్ని పంటలకు రైతు కు గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. హంద్రీ నివా కాలువలను వెడల్పు చేస్తూ అన్ని చెరువులకు నీటి సరఫరా చేయాలన్నారు. సేజ్ పేరుతో సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేయని ప్రాంతాల్లో భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టు రైతుల ప్రోత్సాహక బకాయిలు రూ. 72 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి, వెంకటస్వామి, గరుడం పల్లి పోతలయ్య, రైతులు శంకరయ్య, నారాయణ స్వామి బత్తలపల్లి హరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : రైతుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్థానిక తహశీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బ్యాళ్ల అంజి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నీలకంఠారెడ్డి, డిటి బాలాంజి నేయులుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గిట్టుబాటు ధర కల్పించి ఎరువులు విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలన్నారు. సెజ్‌ల పేరుతో పరిశ్రమలకు తీసుకున్న భూములను తిరిగి రైతులకు ఇవ్వాలన్నారు. చుక్కల భూముల్లో సాగులో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామాంజనేయులు,వెంకటేష్, ముత్యాలప్ప, రమాదేవి, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నారాయణస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు పోతులయ్య, అవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, రిక్షా ముత్తు, చికెన్ రఫీ, రహీం ,పకీరప్ప, బాబా, అల్లా బకష్, టైలర్ ముత్తు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నాయకులు వివి రమణ, రామిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి కుల్లాయప్ప తదితరులు తమ డిమాండ్లతో కూడిన వినత పత్రాన్ని తహశీల్దార్ రామాచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నాగేంద్ర, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో తహశీల్దార్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, రఫీ, ఉదయ్, ముస్తాక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు :కలెక్టర్

వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఈ వేసవిలో ఎక్కడ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు, ఎంపీడీవోలు, కమిషనర్లతో తాగునీరు, ఉపాధి హామీ, పి 4 సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారిగా నీటి సరఫరా అవుతున్న పైపులైను తనిఖీ చేయాలన్నారు. వచ్చే మూడు నెలలు కీలకమని ముందే నీటి ప్రణాళికలను తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిరోజు నీటి సమస్య అంశంపై సమీక్షించుకోవాలన్నారు. మరమ్మతులు అవసరమైతే వెంటనే పనులు చేపట్టాలని నిధులు గురించి ఆలోచించవద్దని అన్నారు. బోరు బావులను, చేతి పంపులను మరమ్మతులు చేపట్టాలని పారిశుద్ధ్య లోపంతో వ్యాధులు సంక్రమించకుండా చూసే బాధ్యత ఈవోఆర్డీలదేనని కలెక్టర్ పేర్కొన్నారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పి 4 సర్వే డేటాను తనిఖీ చేసుకోవాలన్నారు. చాలా మండలాల్లో సర్వే పనులు వెనకబడ్డాయని పురోగతి చూపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు.

చెవి జాగ్రత్తలు పాటించాలి : చెవికి సంబంధించిన అనారోగ్య సమస్యలకు వెంటనే చికిత్స తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. సోమవారం ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ టీఎస్ చేతన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, వృద్ధులు వినికిడి లోపాలకు గురవుతుంటారని శబ్దాలు పెద్దగా వినడం వల్ల వినికిడి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అలా వినికిడి లోపాలు ఉంటే కాక్లియర్ ఇంప్లాంట్ లాంటి ఆధునిక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వీటిని అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత, జిల్లా టి బి, కుష్టి రోగ నిరోధక అధికారి డాక్టర్ తిప్పయ్య, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఒ డాక్టర్ సునీల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ సుంకం వసూళ్లలో దోపిడీని ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలో తోపుడు బండ్ల మీద వ్యాపారాలుచేసే చిరువ్యాపారులు, రైతుల దగ్గర సుంకాలు వసూలు చేసే కాంట్రాక్టర్లు గెజిట్ ప్రకారం వసూలు చేయాలని, ఈవసూళ్ల దోపిడీని అరికట్టాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జెవి రమణ, కో కన్వీనర్లు టి.అయూబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ మాట్లాడుతూ ధర్మవరం మున్సిపల్ పరిధిలో తోపుడు బండ్లకు, గంప వ్యాపారస్తులకు, ఆటోల మీద చేసే వ్యాపారస్తులకు, ప్రతిరోజు సంత మార్కెట్ కు కూరగాయలు తెచ్చే రైతులకు, చిన్న వ్యాపారస్తులకు, ఇతరాత్ర స్ట్రీట్ వెండర్స్ వ్యాపారస్తులకు సుంకాల కాంట్రాక్టర్లు చుక్కలు చూపిస్తున్నారన్నారు. మున్సిపల్ గెజిట్ ప్రకారం సుంకాలు వసూలు చేయకుండా వారి ఇష్టానురాజ్యంగా సుంకాలు వసూలు చేస్తూ రైతులకు ఇతర చిరువ్యాపారస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ని సోమవారం జరిగే వారాంతపు సంతదినం అయితే కూరగాయలు అమ్మే వారి దగ్గర 50 రూపాయల దగ్గర నుంచి దాదాపు 300 రూపాయల వరకు అందిన కాడికి దండుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమైన పండుగలకు, పట్టణంలో జరుగు ఉత్సవాలకు చిరు వ్యాపారస్తులు దగ్గరనుండి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, గతంలో అనేక పర్యాయాలు మున్సిపాలిటీ చట్టంలోని గెజిట్ ప్రకారం వసూలు చేయాలని విజ్ఞప్తి చేశామని అయినప్పటికీ మున్సిపల్ అధికారులు వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. భవిష్యత్తులో చిరు వ్యాపారస్తులు, రైతులు, ఇతర చిన్న వ్యాపారస్తులతో అధిక సుంకాలు వసూలు చేస్తే సిఐటియు తోపుడుబండ్ల కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

చేనేత కుటుంబాలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలను ఆదుకోవాలని ఎపి చేనేత కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు గుంపు హరి, వెంకటస్వామి, మారుతి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో చేనేత పరిశ్రమకి పుట్టినిల్లు ధర్మవరం చేనేత పరిశ్రమ అన్నారు. ఇటువంటి ప్రాంతంలో చేనేతల ఆకలి చావులు, ఆత్మహత్యలతోకార్మికుల కుటుంబాలకి కడుపు కోతలుగా మిగిలాయన్నారు. నేసిన చీరలకు కనీస గిట్టుబాటు ధరలు లేక, పవర్ లూమ్స్ మగ్గాల ధాటికి తట్టుకోలేక, పనులు లేక నేతన్నలు మగ్గాలకి ఉరి వేసుకుని రాలిపోతున్నారన్నారు. చేనేతల కోరికలు గొంతెమ్మ కోరికలు కాదన్నారు. నేతన్నల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమం లో చేనేత నాయకులతో పాటు సిఐటియు నాయకులు జెవి. రమణ, టీ, అయూబ్ ఖాన్, ఎల్, ఆదినారాయణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

సోలార్ పనులను అడ్డుకుంటాం : సిపిఎం

ప్రజాశక్తి - నంబులపూల కుంట

మండల పరిధిలోని మరికమ దిన్నె గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్రాజెక్టుకు అడ్డుకుంటామని సిపిఎం, సిఐటియు నాయకులు హెచ్చరించారు. మేరకు నాయకులు నాగిరెడ్డి, నాగరాజు సోమవారం స్థానిక తహశీల్దార్ దేవేందర్ నాయక్ వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు తెలియకుండా సర్వే చేయకూడదని సాగు చేసుకుంటున్నా ప్రభుత్వ భూములు వారికే డి పట్టా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సుమారు 100 మంది పైగా రైతులు ప్రభుత్వ భూమల్లో బోర్లు వేసుకొని ఉద్యాన పంటలు సాగు చేసుకుంటున్నారని భూమిపై వారికి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే సిపిఎం తరఫున రైతులు పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డిచ ఈశ్వర్ రెడ్డి తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేదలందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ర్యాలీలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో కలెక్టరేట్ కు చేరుకున్నారు. కలెక్టరేట్ ముందు సిపిఐ, రైతు సంఘం నాయకులతో పాటు పేదలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఇళ్లపట్టాలతో పాటు గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టామని ముఖ్యమంత్రి స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతామని అవసరమైతే చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, జగదీష్, మహిళా సమైక్య రాష్ట్ర కార్యదర్శులు దుర్గాభవాని, పద్మావతి, వ్యవసాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, అధ్యక్షుడు కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసు ఛేదింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు వద్ద మామిడి తోటలో జరిగిన వ్యక్తి దారుణ హత్య కేసును రెండు రోజుల వ్యవధిలోని పుట్టపర్తి పోలీసులు ఛేధించారు. ఈ మేరకు డీఎస్పీ విజయ్ కుమార్ పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వెంగళమ్మ చెరువులో నివాసముంటున్న చియ్యేటి నగేష్ భార్య సునీత బుడ్డన్న గారి దివాకర్ అనే యువకుడితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలిసి నగేష్ భార్యను మందలించి పద్ధతి మానుకోవాలని హెచ్చరించాడు. దీంతో సునీత దివాకర్ ఇద్దరు కలిసి నగేష్‌ను అంతమొందించాలని పథకం పన్నారు. ముందస్తు పథకం ప్రకారం గత నెల 28న దివాకర్ గ్రామానికి సమీపంలోని మామిడి తోటలోకి నగేష్‌ను ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లి మద్యం తాగించి కొడవలితో అతికిరాతకంగా నరికి చంపాడు. దివాకర్, నగేష్ ను ద్వి చక్రవాహనంపై తీసుకెళ్తుండగా గమనించిన నగేష్ బంధువులు అతని ప్రశ్నించగా దాటవేత సమాధానమిచ్చాడు. నగేష్ తమ్ముని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం కర్ణాటక నాగే పల్లి వద్ద దివాకర్ ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుడి సమాచారం మేరకు మృతుడి భార్య సునీతను కూడా అదుపులోకి తీసుకున్నారు. కేసు చేదింపులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ రత్న అభినందించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ మండలంలోని వెంకటగిరిపాల్యంకు చెందిన రేషన్ డీలర్ భర్తపై సోమవారం కియా పోలీస్ స్టేషన్లో లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. బాధితులు సునీత, హరీష్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు.. స్టోర్ డీలర్ పూజ భర్త మంజునాథ్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తనను లైంగికంగా వేధించారని, గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారి పోయాడని తెలిపారు. సోమవారం ఉదయం పిల్లలను పాఠశాలలో వదిలి వస్తుంటే మంజునాథ్, అతని భార్య పూజ రోడ్డుపై దుర్భాషలాడారని వాపోయారు. ఈ విషయంపై కియా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఈ విషయంపై కియా స్టేషన్ ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ ఫిర్యాదు చేశారని, విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన బోయ వంశీ(38) సోమవారం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన బోయ వంశీ కియా అనుబంధ సంస్థలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ ఇద్దరు కుమారులు, భార్యను పోషించుకునేవాడు. కుటుంబ అవసరాలకు నెల నెలా వేతనం సరిపోయేదికాదు. దీంతో పలువురి వద్ద దాదాపు రూ. 6 లక్షల వరకూ అప్పులు చేశాడు. 15 రోజులుగా ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తను నివాసం ఉంటున్న రేకుల షెడ్డుకు ఉరి వేసుకున్నాడు. వారి ఇంటి వద్దకు వెళ్లిన తండ్రి, అప్పుడే కూలి పని నుంచి వచ్చిన భార్య ఉరికి వేలాడుతున్న వంశీని చూసి బోరున విలపించారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. కేసు నమోదు చేసుకొని పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని సంకేపల్లి క్రాస్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఆటో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. మహిళ కదిరిలో ఉన్న కూతురిని చూడటానికి చూడటానికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని చెప్పారు. ముదిగుబ్బ ఎస్ఐ నాగభూషణ్ ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

హిందూపురంలో దొంగ బంగారం కలకలం..!

ప్రజాశక్తి - హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలో బంగారు దుకాణాలపై కర్నాటక పోలీసుల సోదాలు కలకలం రేపింది. కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గలో దొంగలించిన బంగారం హిందూపురం పట్టణంలో రెండు షాపులలో విక్రయాలు జరిగినట్లు గుర్తించారు. అయితే కర్నాటక పోలీసుల రాకను ముందుగానే తెలుసుకున్న స్థానిక బంగారు షాపుల వ్యాపారులు దుకాణాలకు తాళాలు వేసి పరుగులు పెట్టారు. దొంగ బంగారం విక్రయాలు జరిపిన రెండు దుకాణాలపై పోలీసులు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. దొంగలించబడిన బంగారు ఆభరణాలు, దొంగసొత్తు విక్రయాలు, నకిలీ బంగారు ఆభరణాల విక్రయాలు, పన్ను ఎగవేత వంటి నేరాలను అరికట్టడానికి కర్నాటక పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. హిందూపురం పట్టణంలోని షరాఫ్ బజార్ లో ఉన్న కొన్ని దుకాణాలలో కర్నాటక పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు.